# బీడి

వర్షం కుండపోతగా కురుస్తున్నది. షావుకారు సాలయ్య గల్లపెట్టె ముందు కూర్చున్నాడు. బేరంలేక నౌకరు లాలయ్య కునికిపాట్లు పడుతున్నాడు.

"వారీ! లాలుగా కూరుకుతున్నావుర?"

"పని లేకుంటె కూరుకుమనేనారా నీకు నెలకు యాభయిచ్చేది?"

"బాంచెన్ సేట్."

ఏం పని చెప్పాలో సాలయ్యకు చప్పున తోచలేదు.

"లాలుగా నీకు కథలొస్తాయిరా?"

"వత్తయి... ఏం కత చెప్పమంటరు...? భట్టి విక్రమార్కునిది... సెన్నాల రామలింగులుది" – లాలయ్య.

"ఏదో నా బొంద కత సెప్పు" సాలయ్య విసుక్కున్నడు.

"ఎనుకట మాంచి షావుకారి వుండెనట. మా దండి విజ్జె బుద్ధి గల్గినోడట. కూసంత పిసినారట. గుమ్ములనిండా ధాన్యం, సందుగల నిండా సొమ్ము, మేడమీద మేడ సంపాయించి ఆఖర్న సెల్లిపోయిండట...."

"అయ్యో పాపం....!"

"అయితే సొన్నాయిలు, తమ్మల్లేకాక పట్నం నుంచి బాండోల్లను పిలిపిచ్చి ఘణంగా పూలు జల్లుకుంట శవాన్ని ఊరేగించుకుంట తీస్కపోతున్నరట. అంతట్ల కొడుకు ఏకుడు పేలాలు చిల్లర పైసలు చల్లుకుంటూ శవం వెంట నడువంగ...."

"ఆఁ నడువంగ...!"

"ఒక్కసారే పీనుగు బరువైపోయి మోసేవాళ్లు భుజాలు కుంగిపోయి పీనుగును మరింక మోయలేమని కింద దించిండ్లంట.".

"అదెరా"

"గదే యెవ్వలకు అంతుబట్టలే..."

షావుకారి సాలయ్య అగ్గిపుల్ల గీకి బీడి ముట్టించి దమ్ములాగి పొగ నోటితోనే...

"మా సెడ్డ సిక్కొచ్చిందే..." అన్నాడు.

"శాత్రం తెలిసిన పురోయితులు దంగయిపోయిండ్లట. ఆ దారెంట సెన్నాల రామలింగు పోతున్నోడు గీ సిత్రం జూసి ఆడికచ్చిండట..."

"ఆనికి తెల్సిందా?"

లాలయ్య కిసకిస నవ్విండు!

"తెల్సిందట. కొడుకును వోరకు పిలిసి మీ అయ్య పిసినారి. నువ్వు సిల్లర సల్లుతంటె అగో పదిపైసల బిళ్ల కిందబడ్డది. మరందుచేత మీ అయ్యే కదలనంటండు. ఆ బిళ్ల తీసి పాడెమీదేయి. బరువు తగ్గుతడు" అన్నడట.

"ఓర్నీయమ్మ..." షావుకారి సాలయ్య.

"కొడుకు అట్లా చేసిండట – పీనుగు ఈసారి అలుకగ లేసిందట" ఆవులించి చిటికేస్తూ లాలయ్య.

"ఓ బీడియ్యి షావుకారీ" అన్నాడు లాలయ్య.

"కైతుకాల ముండకొడుక పట్టూ" అని మాసిన ముతక బనీను జేబులోనుండి బీడి తీసి లాలయ్యకిచ్చిండు సాలయ్య.

❄

ఆంధ్రజ్యోతి వారపత్రిక 27-07-1979